# పోలీసు వెంకటస్వామి కథలు: రమణి విలాసం - ప్రొ॥ సూరత్తు వేణుగోపాలరావు

క్రిమినల్ లాయర్ పరశురామయ్య నిజంగా భార్గవరాముడే. చేతిలో ఒక గండ్రగొడ్డలి మాత్రమే తక్కువ. కాని ఆయన న్యాయస్థానంలో నిలబడి కాగితాలను కరవాలంగా మార్చి భీకరంగా తిప్పుతూ కేసులో ఉన్న అవకతవకలను వర్ణిస్తూ, పోలీసుల విశృంఖల నిరంకుశత్వాన్ని నిందిస్తూ సింహగర్జనలు చేస్తుంటే వకీలు కూడా దద్దరిల్లిపోయే వాళ్ళంటే అతిశయోక్తి కాదు. ఆయన పేరు తెలియని వారు నగరంలో లేరని చెప్పవచ్చు. రాజకీయంగా కూడా కొద్దో గొప్పో పలుకుబడి ఉన్నవాడు. నాకు ఆయనతో ప్రథమ పరిచయం విచిత్రమైన పరిస్థితుల్లో జరగడమే కాకుండా, అనూహ్యమైన పరిణామాలకు దారితీసింది. అందులో వెంకటస్వామి సహజంగానే ముఖ్యపాత్ర ధరించకుండా ఉంటాడా?

నగరంలో 'సా.పౌ.స' [సామాన్య పౌర సమితి] అనే సంస్థ చాలా కాలంగా ప్రజా సేవ చేస్తోంది. వీధిలోని మానవుడి ప్రాథమిక హక్కులు రక్షించాలనీ, సమాజంలో అతనికి నిర్దిష్ట స్థానం చేకూర్చాలనీ ఆ సంస్థ ఆశయం. ఈ ప్రయత్నానికి క్రియారూపం ఇవ్వాలని అప్పుడప్పుడు సభలు ఏర్పాటు చేసి, ఏ మంత్రివర్యుడినో, అధికార, అనధికార ప్రముఖుడినో ఆహ్వానించి, ఆయనతో ప్రజాజీవనానికి సంబంధించిన ఒక విషయం మీద ఉపన్యాసం ఇప్పించి, సభాసదులతో ప్రశ్నోత్తరాలు జరిపించి కూలంకషంగా చర్చించటం ఒక పద్ధతి. ఈ పర్యాయం, ఆ సంస్థ దృష్టి పోలీసు డిపార్టుమెంటు మీద పడగానే అధ్యక్షుడూ, కార్యనిర్వాహక వర్గంలోని మరో ముగ్గురూ హుటాహుటీ కమిషనర్‌గారి దగ్గరకు వెళ్ళి ఆయనని ఆహ్వానించారు.

కమిషనరుగారు పూర్వకాలం మనిషి. సభల్లో ఊకదంపుడు ఉపన్యాసాలకంటే ధర్మ నిర్వహణలోనే నిజమైన ప్రజా సేవ ఉందని ఆయన అభిప్రాయం. అందుచేతనో లేక స్టేజ్‌ఫియర్ వల్లనో ఆయన సాధారణంగా ఇలాంటి ఆహ్వానాలు అంగీకరించేవాడు కాదు. సంస్థ ప్రతినిధులు రాగానే, వాళ్ళందరికీ టీ ఆర్డరు చేసి నాకు కబురు పంపాడు.

నన్ను వాళ్ళకి పరిచయం చేస్తూ "మిస్టర్ రావు. మీకు తెలుసు ననుకుంటాను. ఇక్కడ అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తున్నాడు. రచయిత, వక్త-ఏ విషయం మీదైనా అనర్గళంగా మాట్లాడగలవాడు. అందుకే మేమంతా రావుని పోలీసు మేధావి అంటాము. మీ సంస్థకి ప్రస్తుతం కావలసినవాడు ఆయనే కాని, నేను కాదు" అన్నాడు.

అసలు సంగతి సందర్భాలు తెలియని నేను అయోమయంగా దిక్కులు చూస్తూ ఉండిపోయాను. కమిషనర్‌గారు నన్ను ఆ విధంగా ఆకాశానికి ఎత్తడానికి కారణ మేమిటి? పైగా 'పోలీసు మేధావి' అంటున్నాడు. అసలు పోలీసుల్లో మేధావులు కూడా ఉంటారా అని ఇతర మేధావులు సవాలక్ష ప్రశ్నలు వేయడం నాకు తెలియనిది కాదు.

సంస్థ అధ్యక్షుడు మనోహరంగారు కూడా సందిగ్ధంలో పడ్డట్లున్నాడు. సభకి ఏ ముఖ్యమంత్రినో, తరువాత గృహమంత్రినో, ఆ తరువాత గృహఛిద్రాల ఉపమంత్రినో, ఆయన కూడా దక్కకపోతే-పోలీసు మహా నిర్దేశకుడినో, మెట్లు ఒకటి తరువాత ఒకటి దిగుతూ చివరికి నా దగ్గరకు రావలసిన దుర్గతి పట్టిందేమిటి-అన్న భావం ఆయన మనస్సులో మెదిలి ఉండకపోదు. ఔననలేక కాదనలేక తికమక పడుతున్నాడు. అదే అదను చూసుకొని కమిషనర్ "మీరు సందేహించకండి. మీరు ఉపన్యాసానికి ఎన్నుకున్న విషయం మీద రావు చాలా పరిశోధన చేసి వ్యాసాలు రాశాడు. అదీ కాకుండా రేపు సాయంత్రం నాకు వేరే పను లున్నాయి" అని అధ్యక్ష మహాశయుడికి గత్యంతరం లేకుండా చేసిపారేశాడు.

నేను తెప్పరిల్లి "ఇంతకీ ఏమిటి సార్?" అన్నాను.

రేపు మనోహరంగారి సంస్థ ఏర్పాటు చేసే బహిరంగ సభలో "పోలీసులు-ప్రజలు" అనే విషయం మీద కొంచెంసేపు మాట్లాడాలి. దానికి నువ్వే తగునని చెబుతున్నాను. ప్రజలకి పోలీసుల మీద ఏమైనా అపోహలు ఉంటే అవి తొలగించడం ఇలాంటి సభల ద్వారా వీలౌతుంది."

మనోహరం కూడా అందుకొని "కమిషనర్‌గారికి వీలులేదట. తమరైనా రాకపోతే రసాభాస అయిపోతుంది" అని వేడుకున్నాడు.

కమిషనరుగారు చెప్పిన తరువాత కష్టమో నిష్ఠురమో నేను మాత్రం కాదనగలనా? ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకోవడం కూడా డ్యూటీలో ఒక భాగమేగా !

నేను నా గదికి వెళ్ళి ఉపన్యాసం తయారు చేసుకోవడానికి ఆయత్తపడ్డాను. ఏవో నాలుగు మాటలు సమయానికి తోచినట్లు చెపితే పాత్రికేయులు ఏవేవో అర్థాలు తీసి చెడామడా విమర్శించవచ్చు; ఆపైన ప్రభుత్వం నా సంజాయిషీ ఇవ్వమని తాఖీదు పంపవచ్చు. అందుకని ఉపన్యాసానికి నిర్దిష్టంగా కావలసిన ముఖ్య విషయాలు రాసుకుంటూ వెంకటస్వామి వచ్చింది చూడలేదు.

ఆ మహానుభావుడు అలా ఎంతసేపు నిలబడ్డాడో కాని చివరకి పట్టలేక "దొరగారూ !" అన్నాడు.

నేను తల ఎత్తకుండానే "రేపు సాయంత్రం జూబ్లీ హాలులో మీటింగు కోసం తయారవుతున్నాను. ఇప్పుడు నన్ను డిస్టర్బు చేయవద్దు" అని విసుక్కున్నాను.


"మీటింగు ఎప్పుడు సార్?"

"రేపు సాయంత్రం ఆరు గంటలకి. అయినా ఆ సంగతి నీ కెందుకు?" అని వదిలించుకున్నాను.

** ** **

మర్నాడు సాయంత్రం నేను సభకు హాజరయ్యాను. సాధారణంగా ఇలాంటి సభలకి జనం ఎక్కువ రారు. కాని ఆనాడు ఎందుకో హాలు విపరీతంగా నిండిపోయింది. టైము ప్రకారం ఉపన్యాసం మొదలుపెట్టి ప్రజలకి-పోలీసులకి మధ్య సన్నిహితత్వం సమాజానికి అత్యవసరం కాబట్టి దానికోసం ఒకవైపు పోలీసులు, మరోవైపు ప్రజానీకం కూడా అవిరళ కృషి చేయాలి" అని ఒక అరగంట సుత్తివేసి నిర్ణీత సమయానికి ముగించాను.

ఉపన్యాసానంతరం అధ్యక్షుడు లేచి "ఈనాడు రావుగారు మనకు చాలా గంభీరమైన విషయాలు



చెప్పారు. ఇక ప్రశ్నోత్తర సమయం. మీకు ఏమైనా సందేహాలుంటే నిరభ్యంతరంగా తీర్చుకోవచ్చు" అని ప్రకటించారు.

ఆ మాట అన్నాడో లేదో, ముందు వరుసలో కూర్చున్న పరశురామయ్య తటాలున లేచి కోర్టు భంగిమలో "రావుగారూ, తమ ఉపన్యాసంలో పోలీసులకు ప్రజల సహకారం కావాలనడం బాగానే ఉంది. కాని అటువంటి సహకారం కావాలంటే పోలీసులు కూడా తమ ప్రవర్తనని మార్చుకోవాలన్న సంగతి మరిచిపోయినట్లున్నారు. పోలీసులు అవినీతికీ, అధికార దుర్వినియోగానికీ, దౌర్జన్య చర్యలకీ-తరతరాలుగా అలవాటుపడిపోయారని, ప్రజలలో గాఢమైన అభిప్రాయం ఉంది. అది నిర్మూలించడానికి ఏమి చేస్తున్నారు?" అని సూటిగా అడిగారు.

సభాస్థలిని న్యాయస్థానంగా మార్చి స న్నేదో నేరస్థుడిలా చేస్తున్నాడు పరశురామయ్య. కాని ఆయన వేసిన ప్రశ్నలో కొంత నిజం లేకపోలేదు. అందుకని నేను జాగ్రత్తగా "పోలీసు డిపార్టుమెంటులో అవినీతి లేదని నేను అనడంలేదు. ఆ అవినీతి మన సమాజం అంతటా ఉన్నది. దీనికి చారిత్రకంగానూ, సాంఘికంగానూ, రాజకీయంగానూ కారణాలు చాలా ఉన్నాయి. పోలీసు డిపార్టుమెంటులో ఉన్న అవినీతిని అణగదొక్కడానికి మా శాయశక్తులా పాటుపడుతూనే ఉన్నాము" అన్నాను.

"పోలీసులు తృతీయ డిగ్రీ విధానాలు ఉపయోగిస్తున్నారని లోకం కోడై కూస్తోంది. చివరికి ముల్లా అంతటి జడ్జిగారు కూడా పోలీసు వ్యవస్థని నిర్మొహమాటంగా విమర్శించాడు. చట్ట విరుద్ధంగా దౌర్జన్యచర్యలు చేస్తూ ప్రజల సహకారం కోరడం ,అసంబద్ధం. ఇలాంటి ఉపన్యాసాలు ఇవ్వడం కంటే మీ పోలీసు యంత్రాంగాన్ని మరమత్తు చేసుకోవడం మంచిదని మనవి చేస్తున్నాను" అని పరశురామయ్య మళ్ళీ ఒక విసురు విసిరాడు.

"నేను మీతో వాదించడానికి ఇక్కడకు రాలేదు. పోలీసు పరిపాలనా యంత్రాంగంలో తప్పులు చేయడం, అడపాతడపా అఘాయిత్యాలు జరగడం మాకు సిగ్గుచేటే. అవి జరగకుండా చూడటం మా బాధ్యత. అయితే చెదురుమదురు సంఘటనలను తీసుకొని పోలీసు డిపార్టుమెంటు సంతటినీ ఖండించడం, వాళ్ళు అహోరాత్రాలు చేస్తున్న కృషినీ, త్యాగాలనూ మరిచిపోవడం-యుక్తాయుక్త విచక్షణ లేకుండా విమర్శించడమే అవుతుంది" అని నేను కూడా గొంతు హెచ్చించి అన్నాను.

వాగ్వాదం శ్రుతిమించి రాగాన పడుతుందేమో అన్న భయంతో అధ్యక్షుల వారు కృతజ్ఞతాభివందనాలతో సభ ముగించారు.

నేను అందరి దగ్గరా సెలవు తీసుకొని బయటికి వచ్చి కారు ఎక్కపోతుంటే వెంకటస్వామి ప్రత్యక్షమైనాడు.

"హలో స్వామీ ! ఇక్క డున్నావేమిటి? నాతో రా" అన్నాను.

వెంకటస్వామి కారు ఎక్కుతూ "తమరు ఉపన్యాసం ఇస్తారని తెలిసి నేనే కాదు మన డిపార్టుమెంటులో చాలామంది వచ్చారండి. తమరు బ్రహ్మాండంగా మాట్లాడారు" అని ప్రశంసించాడు.

"ఓహో, అదా కారణం ! పట్టుమని పదిమంది కూడా రాని ఈ సభ కి ఇంతమంది వచ్చారంటే నాకు నిజంగానే ఆశ్చర్యం వేసింది. కొంపతీసి జనాన్ని లారీల్లో, బస్సుల్లో పట్టుకురాలేదు కదా ! పోనీలే !...ఇంతకూ ఆ లాయరు పరశురామయ్య న న్నెంత ఇరకాటంలో పెట్టాడో చూశావుగా?"

"ఆయన తరహాయే అంత ! కోర్టులో కూడా మనల్ని దారుణంగా విమర్శిస్తాడు. తప్పుడు సాక్ష్యాలు పెట్టామనో, అనుమానితుల్ని చిత్రహింసలు పెట్టామనో నిత్యమూ విరుచుకుపడుతూనే ఉంటాడు. మన ఉద్యోగంలో ఉన్న సాధక బాధకాలు ఎవరికి తెలుస్తాయి సార్

** ** **

నేను పరశురామయ్యగారిని వృత్తిరీత్యా మళ్ళీ త్వరలో కలుసుకుంటానని అనుకోలేదు. కాని పది రోజుల తరువాత ఆయనే నన్ను చూడడానికి ఆఫీసుకి వచ్చాడు. ముఖం జేవురించి ఉంది. నేను గౌరవపూర్వకంగా ఆయనను కూర్చోబెట్టి కుశలప్రశ్నలు వేశాను.

ఆయన కొంచెం బిత్తరపడుతూ "ఆనాడు సభలో ఏదో అన్నాను. మిమ్మల్ని కించపరచాలనే ఉద్దేశం నాకు ఏమీలేదు. తమరు ఏమీ అనుకోలేదు గదా !" అన్నాడు.

"మాకు మామూలే. ఇంతకీ మీరు వచ్చిన విషయం చెప్పారు కాదు."

పరశురామయ్య నసుగుతూ-"ఏమీ లేదండి. మా ఇంట్లో ఎప్పుడూ లేనిది దొంగతం జరిగింది. సుమారు మూడు వేల రూపాయలు ఖరీదు చేసే బంగారపు గొలుసు పోయింది. మా ఆవిడ సాధారణంగా చాలా జాగ్రత్తగా ఉంటుంది. కానీ ఆనాడు బల్లమీద పెట్టి మరిచిపోయింది. ఆ గొలుసు కనబడలేదు. మా ఇంట్లో నరసింహులు



అనే కుర్రవాడు పని చేస్తున్నాడు. ఇది వాడి పనే. దొంగ రాస్కెల్ ! మోజంజాహి మార్కెట్ పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చాను. అనుమానితుడు పిల్లవాడని మీ జువెనైల్ బ్రాంచికి కేసును బదిలీ చేశారట. ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామిగారు ఆ కేసును చూస్తున్నాడు. నేను నిన్న అక్కడకు వెళ్ళి నరసింహులుతో నిజం కక్కించారా-అని అడిగితే కస్సుమన్నాడు. ఆయన ప్రవర్తన అవమానకరంగా నాకు తోచింది. ఇలాంటి సమయాల్లో పోలీసు స్టేషన్లకి వచ్చే వాళ్ళతో మర్యాదగా మాట్లాడాలి గాని ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉన్న వాళ్ళు కూడా ఆ విధంగా ప్రవర్తించడం బాగాలేదు" అని అన్నాడు.

వెంకటస్వామి అలా చేశాడంటే నాకు కోపం వచ్చింది. గబాలున ఫోను తీసుకొని పి.ఏ.తో వెంకటస్వామిని అర్జెంటుగా రమ్మనమని అన్నాను.

పరశురామయ్య అదో విధంగా ముఖం పెట్టి "మీతో ఏదో యాదాలాపంగా అన్నాను. మీరు ఇన్‌స్పెక్టర్‌ని ఏమీ అనకండి. ఏదో విధంగా వ్యవహారం తలక్రిందులు చేస్తాడు" అని తన భయం వ్యక్తం చేశాడు.

ఇంతలో వెంకటస్వామి వచ్చాడు.

నేను ముభావంగా "వెంకటస్వామీ పరశురామయ్యగారి ఇంట్లో చోరి జరిగిందట గదా ఏదైనా ఆచూకీ దొరికిందా?" అన్నాను.

వెంకటస్వామి "లేదండి మా శాయశక్తులా ప్రయత్నం చేసినా ఆ నరిసిగాడు తన కేమీ తెలియదని లబోదిబో మన్నాడు. అందుకని అరెస్టు చేసి బాలనేరస్థుల గృహానికి పంపించాను" అన్నాడు.

పరశురామయ్య కలగజేసుకొని ఘాటుగా-"ఇదేమి చోద్యమండీ ! అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు దొంగతనం చేసినవాడిని పట్టుకొని మీ చేతుల్లో పెడితే, వాడితో నిజం చెప్పించకుండా ఎకాఎకీ పంపించేస్తారా? ఇలా చేస్తే మీరు నేరస్థులను ఎలా పట్టుకుంటారు?" అన్నాడు.

"వెంకటస్వామీ, ఆ పిల్లవాణ్ణి పూర్తిగా ప్రశ్నించలేదా? అంత తొందరగా రిమాండుకు పంపించవలసిన అవసరం ఏమిటి?" అన్నాను.

వెంకటస్వామి "అబ్బెబ్బే ! వాణ్ణి నేనే స్వయంగా ప్రశ్నించాను సార్ ! వాడు నాకు ఏ పాపమూ తెలియదని గొల్లుమంటున్నాడు. పైగా వాడే చేశాడు అనడానికి పరశురామయ్యగారి అనుమానం తప్ప ఏ ఆధారమూ లేదు. అదీ గాకుండా బాలనేరస్థుల విషయంలో దయాదాక్షిణ్యాలతో వ్యవహరించాలని తమరు పదే పదే చెప్పటంవల్ల, పోలీసు లాకప్పులో పెట్టకుండా కుర్రవాణ్ణి బాలనేరస్థుల గృహానికి పంపించాను. ఇది పెద్ద కేసు కాదు కాబట్టి తమ దృష్టికి తేవడం అవసరం లేదనుకున్నాను, క్షమించండి" అన్నాడు.

పరశురామయ్య చండప్రచండ కోపంతో-దూర్వాస మహాముని శాపం ఇచ్చేముందు పెట్టే పోజు పెట్టి "అబ్సర్డ్ ! మన నగర పోలీసులు ఇంత చేతకాని వాళ్ళని ఎప్పుడూ అనుకోలేదు. మీరైనా చెప్పండి, చేతికి దొరికిన దొంగని నాయనా, బాబూ, నిజం చెప్పరా అని కాళ్ళా వేళ్ళా పడితే ఎవడన్నా చెబుతాడా?" అని గర్జించాడు.

నాకు వస్తున్న కోపాన్ని కొంచెం దిగమింగి-"పరశురామయ్యగారూ, ఇంతకీ మీరు అనేది ఏమిటి?" అన్నాను.

"నా బొంద ! పరిశోధన ఎలా చెయ్యాలో నేను మీకు చెప్పాలా? ఫలానా వాడు బంగారు గొలుసు అపహరించాడని నేను బల్లగుద్ది చెబుతూ ఉంటే, వాణ్ణి నయానా భయానా లొంగదీసి పోయిన సొత్తును స్వాధీనం చేసుకోవాలి. అలా చేయకపోతే పోలీసులకి కూడా దొంగ వెధవలతో లాలూచి ఉందని అనుకోవలసి వస్తుంది" అని ఆయన కేకలు వేశాడు.

నేను ఏదో చెప్పబోతున్న వెంకటస్వామిని వారించి "పరశురామయ్యగారూ ! మీరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడానికి ఇది కోర్టు కాదు. బాలనేరస్థుల కోసం కొత్త శాఖను నిర్మించి, పోలీసులతో వాళ్ళ మనస్తత్వాన్ని అర్థం చేసుకునే విధంగా పని చేయిస్తున్నాను. ఇందులో తప్పు ఏమైనా ఉందా? మీరు బాలనేరస్థుల కోసం ప్రత్యేకమైన చట్టం ఉందని మరిచిపోయారు కాబోలు !" అని వ్యంగ్యంగా నవ్వాను.

"తప్పో, ఒప్పో ఎవరికి కావాలండీ? మాకు కావలసింది ఫలితం ! దొంగల్ని సంఘ విద్రోహుల్ని లాలించడం పోలీసులకి భావ్యమేనా? ఏదో కొంచెం వత్తిడి లేకపోతే, ఏ నేరస్థుడు నిజం చెబుతాడు? మీ పోలీసులు ఇంతమంది ఉన్నది నేరస్థుల్ని పట్టుకోవడానికా లేక బుజ్జగించడానికా? ప్రజ లందరూ కలసి, మీ పోలీసులకి ఒక గాజుల మలారం బహుమతి ఇచ్చేటట్లు చెయ్యకపోతే నా పేరు పరశురామయ్య కాదు" అని శపథం


తపాల్ మూలముగా చిత్రకళ!



బొమ్మలు చిత్రించుటకును
వర్ణ చిత్రములు చిత్రించు కళను అభ్యసించవలెనా
28 సం॥లుగా మీ అభిమానానికి, శక్తి చాతుర్యానికి
పేరు ప్రసిద్ధి చెందిన "చందును విద్యాలయ"
నుండి తపాల్ మూలముగా తమిళము, ఇంగ్లీషు, మలయాళము, తెలుగు, హిందీ భాషలలో
యింటి నుండే మీరు చిత్రములు వేయు సామర్ధ్యం, నేర్పు చక్కగా అభ్యసించగలరు.

వివరములకు 90 పైసల స్టాంపుతోపాటు అప్లికేషన్ పంపవలసినది.

విలాసం : చందును చిత్ర విద్యాలయ
C/o చిత్రకొళను (AP), 179 సింగన్న వీధి, చింతాద్రిపేట, మద్రాసు-2.

చేశాడు.

వెంకటస్వామి కల్పించుకొని "మా దొరగారు మీలాగే తొందరపడరు కాబట్టి సరిపోయింది. ఇంతకీ మీరు అనేది ఆ పిల్లవాణ్ణి దండించి, పోయిన బంగారం స్వాధీనం చేసుకోమనేగా? నేను మీ అంత లాయరును గాకపోయినా కొద్దో గొప్పో నాకూ అనుభవం ఉంది. నిజంగా ఈ దొంగతనం చేసింది ఆ పిల్లవాడు కాదని నా అభిప్రాయం" అని ఘంటాపథంగా అన్నాడు.

పరశురామయ్య ఉలిక్కిపడ్డాడు. "ఆఁ ! ఏమిటంటున్నారు? ఈ నేరం నరిసిగాడు కాకపోతే ఇంకెవ్వరూ చెయ్యటానికి వీలులేదు. ఇంకా నయం ! మీ పోలీసులకి ఎంత వివరీత మనస్తత్వం ఉందో నాకు తెలుసు. చివరికి ఆ వెధవని నేనే చేశానని కూడా అనగల మహానుభావులు."

"ఆ పని చేసింది మీరు అని నేను అనడంలేదు. కాని నిస్సందేహంగా మీ కుమార రత్నం చేశాడు" అని స్వామి చావుకబురు చల్లగా జారవేశాడు.

వెళ్ళబోతున్న పరశురామయ్య-"ఏమిటీ? కేసు పరిశోధించడం చేతగాక చివరకు నా కొడుకు మీద పెడుతున్నావా, రబ్బిష్ ! నాన్‌సెన్స్ !" అని గావుకేకలు వేయటం మొదలుపెట్టాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. "స్వామీ, నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బాగుండదు సుమా ! ఆయన మనమీద పరువునష్టం దావా వేసి ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించగలడు !" అని హెచ్చరించక తప్పలేదు.

అంతవరకు నిలబడి ఉన్న వెంకటస్వామి కుర్చీలో నిబ్బరంగా కూర్చుంటూ "పరశురామయ్యగారూ, తమరు కూడా కూర్చోండి, కొన్ని విషయాలు సమగ్రంగా మాట్లాడవలసిన సమయం వచ్చింది" అని నెమ్మదిగా అన్నాడు.

"ఎందుకు కూర్చోవాలి? ఇక్కడ ఒక్క క్షణం కూడా కూర్చోను. కమీషనరైనా, కానిస్టేబులైనా పోలీసులు పోలీసులే. మీ చచ్చు ప్రశ్నలకి సమాధానం చెప్పుకుంటూ కూర్చోవాలా?" అంటూ వెళ్ళిపోబోయాడు.

కథ చిన్న మలుపు తిరిగింది. ఈ గొడ వేమిటో స్వామి నాకు ముందు చెప్పకపోయినా, నా సమక్షంలోనే జరుగుతున్న రభసవల్ల ఇందులో ఏదో పెద్ద కిటుకు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. తాడోపేడో తక్షణం తేల్చుకోవటం మంచిదని నేను కూడా గట్టిగా, "పరశురామయ్యగారూ, కొంచెం ఉండండి. మీ ఇష్టం వచ్చినట్లు మమ్మల్ని నానా మాటలూ అని వెళ్ళిపోదా మనుకుంటున్నారు కాబోలు. అది వీలుకాదు. వెంకటస్వామి అడిగే ప్రశ్నలకి జవాబులు చెప్పి మరీ కదలండి" అని దబాయించాను.

వినుక్కుంటూ పరశురామయ్య కూర్చున్నాడే గాని, ఆయన కోపం క్షణక్షణం ద్విగుణీకృతమౌతున్న సంగతి నేను గమనించకపోలేదు.

ఇంతలో వెంకటస్వామి నెమ్మదిగా "పరశురామయ్యగారూ, మీ పెద్ద అబ్బాయి పేరు రమణమూర్తి కదా?" అని చిన్న ప్రశ్న వేశాడు.

"అవునయ్యా అవును. మా రెండో అబ్బాయి పేరు సురేంద్రనాథ్. ఇక మూడోవాడి పేరంటారా...నా సంతానం పేర్లన్నీ చెప్పవలసిన అవసర మేమిటో నాకు అంతుపట్టడంలేదు."

వెంకటస్వామి మరింత శాంతంగా "అయ్యా తమరు పెద్దవాళ్ళు. మీకు ముగ్గురు కాకపోతే ముప్పైమంది కుమారరత్నాలు దేశ వ్యాప్తంగా ఉండవచ్చు. అది మాకు అనవసరం. మాకు కావలసింది మీ పెద్దవాడి సంగతి. ఆయన నిజాం కాలేజీలో చదువుతున్నాడు కదా ! ఆయన కాలేజీ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సంగతి మీకు తెలుసు ననుకుంటాను" అన్నాడు.

పరశురామయ్య "తెలుసునయ్యా, తెలుసు. అయితే మీ రడిగే చొప్పదంటు ప్రశ్న లన్నిటికీ జవాబు చెప్పుకుంటూ పోవలసిందేనా? మా ఇంట్లో జరిగిన దొంగతనం రిపోర్టు చేయడమే నా పొరపాటు. మీ రీ నాటకం చూస్తూ ఆనందిస్తున్నట్లున్నారు. నా అంతటి వాడినే మీ రిలా సతాయిస్తే సామాన్య ప్రజల మాట ఏమిటి? అందుకే వాళ్ళు ఎన్ని దౌర్జన్యాలు జరుగుతున్నా పోలీసు స్టేషన్ దరిదాపులకే పోరు." అని నన్ను సంబోధిస్తూ "మిస్టర్ రావ్, చూస్తున్నారుగా, మీ ముందే మీ ఇన్‌స్పెక్టర్ ప్రవర్తన ఎంత అసభ్యంగా ఉందో? ఈ విషయం ఇంతటితో ఆగదని మాత్రం మరిచిపోకండి. నే నెవరిననుకుంటున్నారు?" అని దురుసుగా అన్నాడు.

నాకు కోపం వచ్చింది. "పరశురామయ్యగారూ ! వెంకటస్వామి మిమ్మల్ని ఏవిధంగానూ అవమానించలేదు. సగౌరవంగా, చట్టరీత్యా అడగవలసిందే అడుగుతున్నాడు. మాతో సహకరించవలసిన మీలాంటి పెద్ద మనుషులు అనవసరంగా నోరు పారేసుకుంటున్నారు. ఈ విషయం ఇంతటితో ఆగదని నన్ను కూడా బెదిరిస్తున్నారా? బాగుంది. అదీ చూద్దాం" అని "వెంకటస్వామీ, నీ కేదన్నా సమాచారం కావాలంటే త్వరగా అడిగి తేల్చేసుకో, ఆయనకి ఎన్నో పనులుంటాయి" అని తీక్షణంగా చూశాను.

వెంకటస్వామి పరిస్థితులు అవగాహన చేసుకుని "చూడండి పరశురామయ్యగారూ, మీ అబ్బాయి యూనియన్ ఎలక్షన్ల కోసం మిమ్మల్ని ఏమన్నా డబ్బు సర్దమన్నాడా?" అని సంక్షిప్త ప్రశ్న వేశాడు.

ప్రప్రథమంగా పరశురామయ్య ఉలిక్కిపడ్డాడు. యూనియన్ ఎలక్షన్ సంగతి ఎందుకా అని నేను కూడా కొంచెం ఉలిక్కిపడ్డా ననుకోండి.

ఇంతలో లాయరుగారు ధీమాగా-"అడిగాడయ్యా అడిగాడు, వెయ్యి రూపాయలు కావాలన్నాడు. అడిగినంత మాత్రాన పిల్లకుంకలకి-అదీ యూనియన్ ఎలక్షన్లకోసం వెయ్యి రూపాయ లిచ్చే శుంఠ ననుకుంటున్నారా? కావాలంటే ఒక నూరు రూపాయలు తీసుకో, ఆపైన చిల్లిగవ్వ కూడా ఇవ్వను అన్నాను. ఇక మీ యక్షప్రశ్నలు చాలుగాని, వెళ్తాను" అని లేచాడు.

వెంకటస్వామి కదలకుండా "అదే కొంప ముంచింది సార్" అన్నాడు.


లేచిన పరశురామయ్య "ఏమిటండీ? ఊరుకున్నకొద్దీ ఇష్టం వచ్చినట్లు తలా, తోకా లేకుండా మాట్లాడుతున్నారు. ఇలాంటి తావుకి రావడం నా బుద్ధి తక్కువ" అని వెళ్ళబోయాడు.

వెంకటస్వామి గబాలున లేచి ఆయనకి అడ్డంగా అగస్త్యుల వారి ముందు వింధ్యపర్వతంలా నిలబడి "ఆగండి, మీలాగే మీ అబ్బాయికి కూడా కోపం జాస్తి. తా ననుకున్నది సాధించి తీరితేగాని తృప్తిపడడు. ఈ యూనియన్ ఎలక్షన్ ఒక వంద రూపాయలతో గెల వగలడటండీ! ఎంత హంగామా, ఎంత ఖర్చు, కనీసం రెండు వేలు లేకుండా రంగంలోకి దిగితే పచ్చడైపోయేవాడు" అన్నాడు.

వెంకటస్వామి, పరశురామయ్యల సంవాదం పతాక స్థాయికి చేరుకున్నదని నేను కలగచేసుకుని "స్వామీ, సంగతేదో ఇదమిత్థంగా చెప్పు. కాలేజీ యూనియన్ ఎలక్షన్ల మీద నీ లెక్చర్లు ఎవరికి కావాలని?" అని కేకలు వేశాను.

"క్షమించండి సార్. పరశరామయ్య గారింట్లో జరిగిన దొంగతనానికీ, ఎలక్షన్లకీ కీలకమైన సంబంధం ఉంది. ఎన్నికలకి నిలబడి ధారాళంగా ఖర్చు చేయకపోతే సహాయకులు కాస్తా జారిపోతారు. అనుయాయులు అదృశ్యమైపోతారు. అందుచేత మీ అబ్బాయి పెద్ద ఇరకాటంలో పడ్డాడు. అనుకోకుండా కనపడ్డ బంగారు దండని కాస్తా జేబులో వేసుకొని దాన్ని బజారులో రెండు వేల మూడు వందలకి అమ్మేశాడు."

"ఆఁ, ఏమిటంటున్నారు? మా రమణగాడు ఇంత దౌర్భాగ్యపు పని జేశాడా? నేను నమ్మను. ఇది సాధారణంగా పోలీసులు అల్లే కట్టుకథ" అంటూ



పరశురామయ్య తిరిగి వచ్చి కుర్చీలో కూలబడి-"మిస్టర్ రావ్ ! మీరు నేరస్థులను పట్టుకోలేకపోతేపోయారు. అది మీ అసమర్థత. కాని ఇలా అభాండాలు వేసి అయినవాళ్ళనీ, కానివాళ్ళనీ కేసుల్లో ఇరికించడం క్షంతవ్యం కాదు. ఈ సంగతిపై వాళ్ళ దృష్టికి తెచ్చి మీ కాండక్టు మీద ఎంక్వైరీ పెట్టించకపోతే నా పేరు పరశురామయ్య కాదు" అని 'ధిక్కారమును సైతునా' అన్న పోజు పెట్టాడు.

ఈ పరిణామాలు నాకు అగమ్యగోచరంగా ఉన్నా అనుభవపూర్వకంగా చేతిలో బలమైన సాక్ష్యం ఉంటేగాని వెంకటస్వామి అంతదాకా రానివ్వడన్న విశ్వాసం నాకు ఉంది. స్వామి ముఖంలో కూడా విజయ చిహ్నాలు స్పష్టంగా కనపడుతున్నాయి.

"స్వామీ, ఎందుకొచ్చిన దీ ముసుగులో గుద్దులాట? అసలు సంగతి పరశురామయ్యగారికి చెప్పేస్తే మన బాధ్యత తీరిపోతుందిగా" అన్నాను.

తక్షణం స్వామి హుంకారం చేస్తూ మాయలమరాఠీల పద్ధతిలో జేబులోంచి ఒక బంగారు హారం తీసి నా బల్లమీద ఉంచాడు. ఆ తరువాత నెమ్మదిగా ఒక కాగితం తీసి, పరశురామయ్యతో "ఇది మీ ఇంట్లో పోయిన నగే అని గుర్తు పడతారనుకుంటాను. ఈ కాగితం రమణమూర్తి నిట్టల రామయ్యగారి నగల దుకాణంలో అమ్మిన రసీదు. దానిమీద మీ అబ్బాయి సంతకం ఉంది. రామయ్యగారు దొంగసొత్తులు తీసుకునే బాపతు కాదు. కాబట్టి బరువును బట్టి బంగారం ధరని వెల కట్టి ఒక్క పైసా కూడా తక్కువ కాకుండా సొమ్ము ఇస్తూ నగకి రసీదు ఇచ్చారు. ఇప్పు డేమంటారు?" అని దెబ్బతీశాడు.

పరశురామయ్య ఇంకే మంటాడు? నిట్టనిలువునా కూలిపోయాడు. దురదృష్టవశాత్తూ అమాంతంగా ఆయనకు గుండెపోటు వచ్చి టపీమంటే ఇంకేమైనా ఉందా? ఆర్డర్లీని పిలిచి కొంచెం కాఫీ తెప్పించి ఇచ్చాను.

ఆయన నెమ్మదిగా తేరుకొని "హరి దౌర్భాగ్యుడా ! ఎంతపని చేశావురా !" అని పళ్ళు పటపట కొరుకుతున్నాడు.

"పరశురామయ్యగారూ, మీరు కొంచెం నిదానించండి. ఈ కాలం పిల్లల మనస్తత్వం అర్థం చేసుకుని మనం వాళ్ళని మంచి దారిలోకి తెచ్చుకోవాలి" అని సముదాయిస్తూ అన్నాను.

ఆయన అటూ ఇటూ చూసి "మీతో ఒక్క నిమిషం ప్రైవేటుగా మాట్లాడాలి" అంటూ సాభిప్రాయంగా వెంకటస్వామి కేసి చూశాడు. అంటే అక్కడ వెంకటస్వామి ఉండడం ఆయన కేదో కష్టంగా ఉందన్న మాట.

స్వామి తటాలున "దొరగారూ, రమణమూర్తిని తీసుకు రావటానికి మనవాళ్ళని పంపించాను. వాళ్ళు వచ్చారేమో చూస్తాను" అనీ అదృశ్యమయ్యాడు. సూచనలు తీసుకోవడంలో దిట్ట.

పరశురామయ్యగారిలో అనుకోని విధమైన మార్పు వచ్చింది. అంతకు ముందు ఆయన ప్రదర్శించిన ధీమా, మాటల్లో హుందా మటుమాయమైపోయాయి. "మిస్టర్ రావ్, తొందరపాటువల్ల ఏమేమో అన్నాను. మీరు క్షమించాలి" అన్నాడు.

ఆయన వైఖరి చూసి నాకు కోపంతో పాటు కొంచెం జుగుప్స కూడా కలిగింది. "దాని కేమిటిలెండి ! మా పోలీసు ఉద్యోగంలో ఇలాంటి సందర్భాలు కోకొల్లలుగా తటస్థపడుతుంటాయి. ఇంతకీ మీరేదో చెప్పాలన్నారు...?"

ఆయన నసుగుతూ 'ఈ విషయంలో నేను చాలా పొరబడ్డాను. మా వా డిటువంటి అప్రాచ్యపు పని చేస్తాడని కలలో కూడా ఊహించలేదు. ఎంత అప్రతిష్ఠ ! ఈ విషయం బయటకి వస్తే నలుగురిలో నవ్వులపాలైపోతాను. మీరు అన్నీ తెలిసిన వాళ్ళు. మా పిల్లవాడి భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. ఏదో విధంగా కేసును ఉపసంహరించుకోండి" అని ప్రాధేయపడ్డాడు.

సామాన్య పౌరుల హక్కులని గురించి, పోలీసు దౌర్జన్యకాండల మీద, అహోరాత్రాలు ప్రచారం చేస్తున్న మహాశయుడు తన కొడుకుని అబద్ధాలాడో, తప్పుడు రాతలు రాసో తప్పించమంటున్నాడు. న్యాయం, న్యాయం అని ఘోషించే వాళ్ళే టకాలున ప్లేటు ఫిరాయిస్తే ఎక్కడుంటుంది న్యాయం? పోలీసు స్టేషన్లలోనా, న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టుకున్న మన కోర్టుల్లోనా, లేకపోతే అవసరాలని బట్టి అభిప్రాయాలు త్రుటిలో మార్చుకునే ప్రజానీకంలోనా?

"మరి ఈ కేసులో మమ్మల్ని ఏమి చెయ్యమంటారు" అన్నాను.

"నేను, తమరికి చెప్పేవాడినా? ఈ కేసులో నగను మా అబ్బాయి పరధ్యానంగా మాదేకదా అని తీసుకువెళ్ళి ఉంటాడు. కాబట్టి ప్రాసిక్యూట్ చేయకుండా డ్రాప్ చేయించండి. నా కంప్లైంటు ఉపసంహరించుకుంటాను" అని వేడుకున్నాను.

తండ్రిగా పరశురామయ్య అలా కోరడం సహజమే. కాని కోరిన వరాలన్నీ ప్రసాదించడానికి నేను పోలీసు మానవమాత్రుణ్ణే కాని, శివుణ్ణీ కాదు, విష్ణుభగవానుడిని కాదు.

"మీరు పుత్రవాత్సల్యంతో ప్రాధేయపడుతున్నారు. కాని నేను చట్టవిరుద్ధంగా పోయే మనిషిని కాను. క్షమించండి" అన్నాను.

పరశురామయ్య కోపంగా "అంటే మీరు కేసు తీసేయరన్న మాట ! దీనివల్ల మీకు వచ్చే లాభం ఏమిటి? రేపు మేము సాక్ష్యం చెప్పాలిగా...మా ఆవిడ తానే ఆ నగని రమణకి ఇచ్చానని చెబితే మీ కేసు ఎక్కడుంటుంది?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"కేసు ఎక్కడుంటుందో నా కనవసరం. కోర్టులో మీరేం చెబుతారో మీరే నిర్ణయించుకోవాలి. మీరు ఇచ్చిన ఫిర్యాదును బట్టి, దొరికిన సాక్ష్యాన్ని బట్టి మా డ్యూటీ మేము చెయ్యక తప్పుతుందా?" అని జవాబిచ్చాను.

ఇంతలో వెంకటస్వామి "దొరగారూ, రావచ్చునా?" అంటూనే లోపలికి వచ్చాడు. అతనితో పాటు సబ్ఇన్స్పెక్టర్ రాఘవులు, నాజూకుగా టెర్లిన్ బట్టలు వేసుకొని నిగనిగలాడుతున్న ఒక యువకుడు ఉన్నాడు. స్వామి ఆ కాలేజీ అబ్బాయిని ముందుకు నెట్టి, "ఈయనే రమణమూర్తి. ముందు తనకేమీ సంబంధం లేదని దబాయించినా సమాచారం అంతా చెప్పిన తరువాత నగని తానే తీసుకువెళ్ళి అమ్మి ఆ డబ్బుతో ఎలక్షన్ ప్రచారం చేసినట్లు ఒప్పుకున్నాడు. తమ ఆజ్ఞ ప్రకారం చేస్తాను" అన్నాడు.


"దీనికి నా ఆజ్ఞ ఎందుకు? చట్టప్రకారం అక్షరాలా చెయ్యవలసింది చెయ్యి. ఆ అబ్బాయిని అరెస్టు చేసి, అతని స్టేటుమెంటును రికార్డు చెయ్యి. ఇక్కడే ఉన్నారు గదా పరశురామయ్యగారు, ఆయన పూచీకత్తు తీసుకొని రమణమూర్తిను వదిలిపెట్టి కోర్టులో చార్జిషీటు ఇవాళ సాయంత్రం లోపల దాఖలు చెయ్యి" అని పరశురామయ్యని ఇక దయచేయమన్నాను.

ఆతను నన్నూ వెంకటస్వామినీ కొరకొరా చూస్తూ బయటికి వెళ్ళిపోయాడు. అతనితో పాటు సబ్ఇన్స్పెక్టరు రాఘవులు, రమణమూర్తి కూడా వెళ్ళారు.

పోబోతున్న వెంకటస్వామి ఆగి "ఒక చిన్న విషయం సార్" అని గొంతు తగ్గించాడు.

"అన్ని కూలంకషంగా చెబితే ఇంకా ఏమిటి? ఏదో ఒక చిక్కు తెస్తేనే గాని నీకు తృప్తి ఉండదా" అని విసుక్కున్నాను.

వెంకటస్వామి చిరునవ్వుతో "అలాంటి దేమీ లేదండి. ఆ పరశురామయ్య తమ రనుకున్నంత తేలిగ్గా ఊరుకుంటాడా? ఆయన పెద్దవాళ్ళ దగ్గర నుంచి తమ మీద కొంత వత్తిడి తేకపోడు" అని వెళ్ళిపోయాడు.



వెంకటస్వామికి నిజంగా దూరదృష్టే కాదు దివ్యదృష్టి కూడా ఉన్నట్లుంది. మధ్యాహ్నం సరిగ్గా మూడు గంటలకి ఐ.జి. గారి దగ్గర నుంచి టెలిఫోను వచ్చింది. "హల్లోరావ్, ఈ ఊళ్ళో లాయరు పరశురామయ్యగారి అబ్బాయిమీద ఏదో కేసు పెడుతున్నారటగా?" అని ముక్తసరిగా అడిగారు.

నేను కేసు విషయాలన్నీ ఆయనకి సంక్షిప్తంగా విశదీకరించాను. అంతా విని ఆయన "నువ్వు చేసింది రైటే, కాని ఆ పోయిన నగ ఎవరో పరాయివాళ్ళు తియ్యలేదుగా 'మిస్టేక్ అఫ్ ఫ్యాక్ట్' అని ముగించడానికి వీలుం దనుకుంటాను" అన్నాడు.

"క్షమించండి. వీలుంటే అట్లాగే చేసేవాళ్ళం. కాని ఇంత జరిగిన తరువాత అలా చెయ్యడానికి వీలులేదు సార్! ఆ కుర్రవాడిమీద ఎలాంటి చర్య తీసుకోవాలో కోర్టు వారే నిర్ణయించడం మంచిది" అన్నాను.

ఐ.జి.గారు కొంచెం చిరాకుగా "నీ ఇష్టం. నేను న్యాయవిరుద్ధంగా చెయ్యమంటానా? కాని అవతల పరశురామయ్య ముఖ్యమంత్రిగారినే పట్టుకున్నాడు. పెద్దాయన కూడా 'చూడండి' అని నాకు చెప్పాడు. వీలైతే చూడు నేను నీకు చెబుతున్నాను" అని ఫోను పెట్టేశాడు.

పోలీసు జీవితంలో రానున్నది రాకమానదు, కానున్నది కాకమానదు కదా! పరశురామయ్యకి రాజకీయంగా పలుకుబడి ఉంది కాబట్టి సరాసరి ముఖ్యమంత్రిగారి దగ్గరకే వెళ్ళి కాళ్ళా వేళ్ళా పడ్డాడు. కాని అభమూ శుభమూ తెలియని నరసింహులు వారం రోజులు పాటు జైలులో మగ్గుతూ ఉంటే వాణ్ణి గురించి పట్టించుకున్న దెవ్వరు? చివరకు వాడి సంగతి రమణమూర్తి కొంచెమైనా ఆలోచించాడా? ఎందుకొచ్చిన చదువూ, సంస్కారం? నే నెవరికి భయపడాలి అనుకుంటూ ఉంటే వెంకటస్వామి మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు.

"రా స్వామీ కూర్చో. నువ్వు అన్నట్లు పరశురామయ్య విజృంభించి ముఖ్యమంత్రి దాకా వెళ్ళాడు. అయితే మనం మన బాధ్యతను చట్టబద్ధంగా నిర్వహిస్తున్నామన్న తృప్తితో తీర్పు కోర్టుకే వదిలెయ్యడం సబబని నేను కూడా పట్టుపట్టాను. కాని ఒక్క విషయం నాకు అవగతం కావడంలేదు. ఇంట్లో పోయిన హారాన్ని రమణమూర్తే అపహరించి నిట్టల రామయ్య దుకాణంలో అమ్మాడని నీ కెలా తెలిసింది? నీకు ఏమైనా దివ్యదృష్టి ఉందా?"

వెంకటస్వామి తన సహజ ధోరణిలో "అంతా తమ దయ" అన్నాడు.

"భలేవాడివే! ఇందులో నా దయ ఏమిటి? అసలు ఇవాళ పొద్దునదాకా ఈ కేసు సంగతే నాకు తెలియదు కదా!"

"ఆనాడు మీటింగులో తమరు చెప్పిన మాటలు ఇప్పటికీ నా చెవుల్లో గింగురు మంటున్నాయి. తమకు జ్ఞాపకం ఉందో లేదో ప్రజలు తమ ప్రత్యేక అవసరాలని బట్టీ, పరిస్థితుల ప్రభావం వల్లనూ అభిప్రాయాలను మార్చుకుంటూ ఉంటారు. కాబట్టి ప్రజలకూ, పోలీసులకీ సన్నిహిత సంబంధాలు ఎంత అవసరమో అంత కష్టమని అన్నారు. అది ఈనాడు తు.చ. తప్పకుండా నిజమైంది. మనమీద ప్రతి రోజు దుమ్మెత్తిపోస్తున్న పరశురామయ్యే నరసింహులు మీద "ఒత్తిడి ఒత్తిడి" అని నన్ను ఒత్తిడి పెట్టాడు. ఆయన మనస్తత్వం చూసిన తరువాత నరసింహులు దొంగతనం చేయలేదేమో అన్న సందేహం వచ్చింది" అని స్వామి గర్వంగా అన్నాడు.

"అది సరేలేవయ్యా అసలు సంగతి ఎలా బైటపడింది?"

"వస్తున్నాను సార్! మీరు సెలవిచ్చినట్లు నాకు ఏ దివ్యదృష్టీ లేదు. మా పెద్దవాడు నాగేంద్రం కూడా నిజాం కాలేజీలో బి.ఏ. చదువుతున్నాడు. మొన్న రాత్రి ఏదో మాటల మీద వాళ్ళ కాలేజీలో జరిగిన ఎలక్షన్‌లో పరశురామయ్యగారి అబ్బాయి, డబ్బు నీళ్ళలాగా ఖర్చు పెట్టాడనీ, తన సహచరులకి బీరు పార్టీలు ఇచ్చాడనీ చెప్పాడు. మూడు కార్లు కూడా అద్దెకు తెచ్చి అసలు ఎలక్షన్లకంటే కూడా ప్రచారం ముమ్మరంగా చేశాడట. అది విని 'ఇంత డబ్బు ఎక్కడ నుంచి తెచ్చాడురా' అన్నాను. మా వాడికి ఎలా తెలిసిందో గాని 'రమణమూర్తి ఏదో నగని నిట్టల రామయ్య షాపులో అమ్మి తెచ్చాడని వినికిడిగా ఉంది' అన్నాడు. నిన్న పొద్దుటే సరాసరి ఆ షాపుకి వెళ్ళి ఆరాతీస్తే అంతా బయటపడింది. అందుకే, మన పెద్దలు..."

వెంకటస్వామికి పరిశోధనా సందర్భంలో ఏదో ఒక సామెత చెప్పటం ఒక ఆనవాయితీ. ఆ కారణంగా నేనే చొరవ తీసుకుని-"ఆగు స్వామీ, ఆగు. సు వ్వనేది తనది కాకపోతే కాశీదాకా దేకమంటారనేనా?" అన్నాను.

"కాదండి. ఈ రమణ విలాసంలో ముఖ్యమైన విషయం తమరు గమనించారుగా? పరశురామయ్య చీటికీ మాటికీ పోలీసుల దౌర్జన్యచర్యలని అరికట్టాలంటూ, తన స్వవిషయంలో మనం నరసింహులుతో నిజం చెప్పించలేని అసమర్థులమని తిట్టిపోశాడు. అందుకే చెప్పేవి శ్రీరంగనీతులు... అని పెద్ద లంటారు" అని ఒక చిరునవ్వు పారేశాడు.

స్వామి చెప్పిన సామెత కొంచెం ఘాటుగా ఉన్నా ఈ విషయంలో పూర్తిగా సరిపోయింది కాబట్టి నేను ఓటమి అంగీకరించక తప్పలేదు. ●

మినీకథ

## హర్ ఏక్‌మాల్ దో హజార్

టి.సుబ్బులక్ష్మి

వాలంటరీ రిటైర్‌మెంటు తీసుకొని బిజినెస్ చేయాలనుకొన్న వామనరావు ఇంట్లోని సామానంతా అమ్మేస్తున్నాడు. మిత్రుడు వరవరరావు కొనాలనుకొన్నాడు. ఫ్రిజ్, టీ.వీ, కూలరు, మిక్సీ, సోఫా, డబుల్ కాట్స్ విత్ బెడ్స్, డైనింగ్ టేబులు, స్కూటరు - 'హర్ ఏక్‌మాల్ దో హజార్' బేరం పెట్టాడు వామనరావు.

"గురూ! వస్తువులన్నీ నేనే కొంటాను కన్సెషను ఏమైనా ఇస్తావా?" బేరమాడాడు వరవరరావు.

"ఓ యస్. ప్రతి వస్తువుతో మరొక చిన్న వస్తువు బోనస్‌గా ఇస్తాను" అంటూ ఇస్త్రీపెట్టె, టీపాయి, రేలు, సూట్‌కేసు లాంటివి ఆశపెట్టాడు.

వరవరరావుకు ఇదీ బాగానే ఉందనిపించింది. "గురూ, నీకు నలుగురు కొడుకులుండాలి వాళ్ళను కూడా అమ్మేస్తే హోల్‌సేల్‌లో నేనే కొనేస్తాను. నలుగురు ఆడపిల్లల్ని కన్నవాణ్ణి" అన్నాడు.

"ఓ యస్. తప్పకుండా తీసుకో."

"రేటెంత?"

"హర్ ఏక్ మాల్ దో హజార్"

"బోనస్?"

"ప్రతి ఒక్క అబ్బాయితో మా అమ్మాయిని ఒకరిని బోనస్‌గా ఇచ్చేస్తాను."

"అమ్మ బాబోయ్! ఈ బోనస్ నాకు అక్కరలేదు నీ నలుగురు కొడుకులను నేను తీసుకుంటాను" అని డబ్బు తెచ్చి సామానూ, నలుగురు కొడుకులనూ తీసుకొని ఇల్లు చేరాడు వరవరరావు.

"మణీ అమ్మాయిలకు సంబంధాలు చూడటంలేదని రోజూ నన్ను తినేస్తున్నావు. చూడు నలుగురికి ఒక్కసారి పెళ్ళి చేస్తాను. ఈ నలుగురు పెళ్ళి కొడుకులనూ చూడు. అన్నీ కలిపి 24,000 రూపాయలు. ఒక్క కూతురు పెళ్ళికే 50,000 రూపాయలు కావాలని గోలపెట్టావు. ఇప్పుడు చూడవోయ్, 50,000 రూపాయలతోనే నేను నలుగురి పెళ్ళి చేస్తాను. ఇంకా నీకేం కావాలో చెప్పు."

మణికి ఇదంతా విచిత్రంగా ఉంది.

ఇంతలో వరవరరావు పెద్దకొడుకు సినిమాకు వెళ్ళి నలుగురు చెల్లెళ్ళతో ఇల్లు చేరాడు. వీళ్ళందరినీ ఇక్కడ చూస్తూనే ఆశ్చర్యపోయాడు.

"ఇదేంటి నాన్నా వీళ్ళిక్కడికెలా వచ్చారు? ఈ సామానంతా యేమిటి?"

"బాబూ, వీరంతా నీ బావమరుదులురా. ఈ సామాను, నలుగురు పెళ్ళి కొడుకులతో బాటు 24,000 రూపాయలకు కొనేశాను. బాగుంది కదూ?"

"నాన్నా ఇదంతా వచ్చి మోసం! వీళ్ళంతా రౌడీలు, దొంగలు, పిచ్చి వాళ్ళు, వెర్రివాళ్ళు! వీళ్ళనాన్న ఎలాగైనా వీళ్ళ పీడ వదిలించుకోవాలని చూస్తున్నాడు. ఈ పెద్ద వాళ్ళిద్దరూ రెండు సార్లు శ్రీకృష్ణ జన్మస్థానానికి కూడా వెళ్ళి వచ్చారు. ఇక ఈ చిన్న వాళ్ళకు చదువు, ఉద్యోగం ఏమీ లేదు. ఒకడికి నత్తి, మరొకడికి చెముడు. ఇలా చేసేరేమిటి నాన్నా? వామనరావుగారి ఆడపిల్లలు ఆణిముత్యాలు. మగపిల్లలు పనికిరాని వాళ్ళు"

"అయ్యో? ఆడపిల్లలను బోనసుగా ఇస్తామంటే ఆడపిల్ల నా కెందుకని వద్దన్నానురా."

"అదేంటి నాన్నా? వారి ఆడపిల్లలు బాగా చదువుకొని ఉద్యోగం చేస్తున్నారు. వాళ్ళను ఎదురు డబ్బిచ్చి తెచ్చుకోవచ్చు."

"ఇంకేముందిరా? హర్ ఏక్ మాల్ దో హజార్ బేరంలో నేను ఘోరంగా మోసపోయాను!" అంటూ నెత్తి నోరు బాదుకొని ఏడుస్తున్నాడు వరవరరావు.

పనికిరాని వస్తువులన్నీ చెల్లుబడి అయిపోయాయని ఆనందంగా భార్యా పిల్లలతో బండెక్కాడు వామనరావు. ★